


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 19 | శుక్రవారం 19 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# రెండేళ్ల పాలన ప్రజా విశ్వాసానికి నిదర్శనం

అత్మకూరులో ఘనంగా రెండేళ్ల పాలన సభ.. వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకం
సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలుగా ం నియోజకవర్గ ప్రగతి,
రెండేళ్లలో రూ. 700 కోట్లతో అభివృద్ధి పనులు,
అభివృద్ధిపై చర్చకు శిల్పా చక్రపాణి రెడ్డికి ఎమ్మెల్యే సవాల్,
శిల్పా వ్యవహార శైలిపై విసుగు చెంది టీడీపీలో చేరిన అత్మకూరు ఎంపీపీ, పలువురు మైనార్టీ నేతలు
ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి





అత్మకూరు, జూన్ 18 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుని, సంక్షేమం మరియు అభివృద్ధిలో ప్రజాదరణతో దూసుకుపోతోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఆర్.ఆర్ కన్వెన్షన్ హాల్ నందు గురువారం నిర్వహించిన 'రెండేళ్ల పాలన – సంక్షేమం, అభివృద్ధి' సభ వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ..2లో


కూటమి నేతల మధ్య భారీ మోటార్ బైక్ ర్యాలీ

# ఎమ్మిగనూరులో కూటమి రెండేళ్ల విజయోత్సవ సభ విజయవంతం

- గాజులదిన్నె ప్రాజెక్టు పూర్తి చేసి రైతన్నలకు సాగునీరు అందించడమే కూటమి లక్ష్యం
- చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకుంటా
- నియోజకవర్గ ప్రజల సంక్షేమ అభివృద్ధికి పాటుపడుతా
- ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి

కర్నూలు ప్రతినిధి జూన్ 18 వార్త సాక్ష్యం:



రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎమ్మిగనూరు పట్టణంలో నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సభ 3లో..

# రైతు భరోసా నిధుల విడుదలకు డేట్ ఫిక్స్

-జూన్ 30న రేవంత్ చేతుల మీదుగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామన్న ఉత్తమ్
-7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడి
-నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మంత్రి



వార్త సాక్ష్యం తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన కీలక కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీ వివరాలను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. "వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయించింది. జూన్ 30వ తేదీన మధిరలో నిర్వహించబోయే 'రైతు సమ్మేళనం' బహిరంగ సభలో 2లో..

## అవినీతిపై సమాధానం చెప్పలేక వ్యక్తిగత దూషణలా?

# మంత్రి అడ్లూరిపై కొప్పుల ఈశ్వర్ ఫైర్

-సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందన్న కొప్పుల ఈశ్వర్
-నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లు మాయపైపోతున్నాయని ఆరోపణ
-చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్



వార్త సాక్ష్యం తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా జగిత్యాల-ధర్మపురి పొలిటికల్ సర్కిల్స్‌లో హీట్ ఒక్కసారిగా పెరిగింది. కాంగ్రెస్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమపై వస్తున్న అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పలేక, లక్ష్మణ్ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారంటూ మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు, 2లో..



# రికార్డు ధర పలికిన హైదరాబాద్ భూములపై న్యాయ వివాదం...

రాయదుర్గం భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు స్టే
భూమి తమదేనంటూ కోర్టును ఆశ్రయించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మే 28న ఎకరానికి రూ. 237 కోట్ల రికార్డు ధర పలికిన భూమి
టీజీఐఐసీ, గౌరా వెంచర్స్‌కు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు
మూడు వారాల పాటు తదుపరి చర్యలు నిలిపివేయాలని ఆదేశం

## ఈ-కేబినెట్ విధానానికి తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ 2

# షబ్బీర్ అలీకి నోటీసులు ఇచ్చాం



-ఎంతటి వారైనా సరే వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్దవద్దన్న మల్లు రవి
-క్రమశిక్షణ కమిటీ ముందు షబ్బీర్ ఆదివారం హాజరవుతారని వెల్లడి
-నేతలు క్షమశిక్షణ ఉల్లంఘిస్తే ఊరుకోబోమని హెచ్చరిక

వార్త సాక్ష్యం తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రచ్చకెక్కడంతో అధిష్ఠానం సీరియస్ అయింది. ఎంతటి వారైనా సరే తమ వ్యక్తిగత సమస్యలను తెచ్చి పార్టీపై రుద్దవద్దని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి హెచ్చరికలు జారీ చేశారు. 2లో..

# నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

-గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేసిన కవిత
-తాను జైల్లో ఉన్నప్పుడు కొందరు నేతలు తన వద్దకు వచ్చారన్న కవిత
-బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో వచ్చారని వెల్లడి
-ఆ ప్రతిపాదనను తాను తీవ్రంగా వ్యతిరేకించానన్న కవిత
-పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డానని వెల్లడి

వార్త సాక్ష్యం



తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్ తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని 2లో..

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 19 జూన్, 2026

# షబ్బీర్ అలీకి నోటీసులు ఇచ్చాం: మల్లు రవి

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలు రచ్చకెక్కడంతో అధిష్ఠానం సీరియస్ అయింది. ఎంతటి వారైనా సరే తమ వ్యక్తిగత సమస్యలను తెచ్చి పార్టీపై రుద్దవద్దని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి హెచ్చరికలు జారీ చేశారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ షబ్బీర్ అలీ, చంద్రశేఖర్ రెడ్డిల అంశంపై స్పందించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి నోటీసులు జారీ చేశామని, ఆయన ఆదివారం కమిటీ ముందు హాజరవుతారని మల్లు రవి తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందన్నారు. నేతలకు ఏమైనా సమస్యలు ఉంటే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేదా రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలే తప్ప క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఊరుకోబోమని వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే మల్లు రవిని కలిసి నోటీసులపై లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

## రెండేళ్ల పాలన ప్రజా విశ్వాసానికి నిదర్శనం



-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుని, సంక్షేమం మరియు అభివృద్ధిలో ప్రజాదరణతో దూసుకుపోతోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఆర్.ఆర్ కన్వెన్షన్ హాల్ నందు గురువారం నిర్వహించిన 'రెండేళ్ల పాలన - సంక్షేమం, అభివృద్ధి' సభ వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం గత రెండేళ్లలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించిందని కొనియాడారు. కేంద్రంలో మోదీ సహకారం, రాష్ట్రంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల సారథ్యంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదులు పడ్డాయని, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల కల్పన, వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందని వివరించారు. నియోజకవర్గ పరిధిలో గత రెండేళ్లలో రూ. 700 కోట్ల నిధులతో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సున్నిపెంటలో రూ. 11 కోట్లతో రోడ్ల విస్తరణ, నూతన సీసీ రోడ్ల నిర్మాణం, ప్రధాన రహదారులపై డివైడర్లు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాల ఏర్పాటు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ. 140 కోట్లతో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం, మరో రూ. 22 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ. శ్రీశైలం జలాశయం, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం, తెలుగుగంగ, కేసీ కెనాల్ వంటి సాగునీటి ప్రాజెక్టులను గాడిలో పెట్టి రైతాంగాన్ని ఆదుకున్నామన్నారు. మహానంది - బోయలకుంట్ల మెట్ట వరకు సుమారు రూ.8కోట్లతో నూతన రహదారి నిర్మాణంతో పాటు బండి ఆత్మకూరు, మహానంది మండలాల్లో నూతన రహదారుల నిర్మాణంతో ప్రజా రవాణాను మెరుగుపరిచామన్నారు, బండి ఆత్మకూరు మండల కేంద్రంలో శ్రీశైలం, మహానంది దేవస్థానాల ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, ప్రభుత్వ కళాశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో మౌలిక వసతుల విస్తరణ. ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్‌లలో మినరల్ వాటర్ ప్లాంట్లు, మెరుగైన వసతుల కల్పన చేస్తున్నామన్నారు.

**శిల్పాకు షాక్.. టీడీపీలో చేరిన ఆత్మకూరు ఎంపీపీ మరియు మైనార్టీ నేతలు**

తమను ప్రజలు చీదరించుకున్నా వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆ పార్టీ నేతలు ఇప్పటికీ అదే తప్పుడు ప్రచారాలు, అహంకార ధోరణిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి దమ్ముంటే నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజల ముందే నేరుగా చర్చకు రావాలని సవాల్ విసిరారు. శిల్పా చక్రపాణి రెడ్డి అహంకార, దిగజారుడు తీరుపై విసుగు చెంది ఆత్మకూరు ఎంపీపీ తిరుపలమ్మ పాటు వెంకటాపురం, కరివేన గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు మైనార్టీ, దళిత కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పథకాల పట్ల ఆకర్షితులై.. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అహంకార ధోరణి పట్ల విసుగుచెంది టీడీపీలో చేరుతున్నట్లు ఎంపీపీ తిరుపలమ్మ పేర్కొన్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన మైనార్టీ నేత నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని భావించి పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.**

పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరులో జరిగిన రెండేళ్ల పాలన సంక్షేమం అభివృద్ధి కార్యక్రమం అనంతరం నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 30 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందుతుందని అన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదలకు డేట్ ఫిక్స్..

తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన కీలక కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీ వివరాలను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. "వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయించింది. జూన్ 30వ తేదీన మధిరలో నిర్వహించబోయే 'రైతు సమ్మేళనం' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను నేరుగా విడుదల చేస్తారు. మార్కెట్ డిమాండ్ మేరకు 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించింది" అని తెలిపారు. తెలంగాణ నుండి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడం సరికాదని అన్నారు.. ఎరువుల కోటా, రామగుండం యూరియాలో రాష్ట్రానికి సింహభాగం కేటాయింపు, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతులు, ఐఆర్ఎఫ్ సీ రుణాల విడుదలపై త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లనుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇకపై అంతా డిజిటల్ కేబినెట్ నిర్వహిస్తామన్నారు.

# ఈ-కేబినెట్ విధానానికి తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ సమావేశాలను డిజిటల్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ విధానం అమలు కోసం రూ.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అమలులో ఉన్న క్యాబినెట్ డిజిటల్ విధానాన్ని తెలంగాణ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసి అమలు చేయనున్నారు.

**ప్రధాన అంశాలు:**

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సర్వీసెస్ ఇన్‌కార్పొరేటెడ్ తో చర్చలు జరిపి సాఫ్ట్‌వేర్‌ను అనుకూలీకరిస్తున్నారు.

తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీడీటీఎస్)ను నోడల్ ఏజెన్సీగా నియమించారు.

ప్రాజెక్టు మొదటి విడతగా రూ.20 లక్షల నిధులు విడుదల చేశారు.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ట్యాబ్‌లు, కంప్యూటర్ల ద్వారా ఎజెండాలు, ఫైల్స్ పరిశీలించవచ్చు.

క్యాబినెట్ నోట్స్, ప్రతిపాదనలు, నిర్ణయాలు పూర్తిగా డిజిటల్ రూపంలో ఉంటాయి.

ఈ విధానం ద్వారా పరిపాలనలో వేగం, పారదర్శకత, సౌలభ్యాన్ని పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డేటా లీకేజీ, హ్యాకింగ్ నివారణకు ప్రత్యేక లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు, బలమైన సెక్యూరిటీ వ్యవస్థలను అమలు చేయనున్నారు

# రికార్డు ధర పలికిన హైదరాబాద్ భూములపై న్యాయ వివాదం..

హైదరాబాద్ నగరంలోని రాయదుర్గంలో ఇటీవల రికార్డు ధర పలికిన అత్యంత ఖరీదైన భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఉత్తర్వులతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ లావాదేవీపై సందిగ్ధత నెలకొంది. రాయదుర్గం పాన్‌మక్తాలోని నాలెడ్జ్ సిటీ పరిధిలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఈ-వేలం వేయడాన్ని సవాలు చేస్తూ ఎస్బీఐ కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. సుమారు 5 ఎకరాల భూమికి సంబంధించిన ఈ వివాదంలో మూడు వారాల పాటు వేలం మరియు తదనంతర ప్రక్రియలను నిలిపివేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు టీజీఐఐసీ, ఎస్బీఐతో పాటు వేలంలో భూమిని దక్కించుకున్న గౌరా వెంచర్స్‌కు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. టీజీఐఐసీ మే 28న నిర్వహించిన వేలంలో 6.29 ఎకరాల భూమి ఎకరానికి రూ. 237 కోట్ల రికార్డు ధర పలికి, మొత్తంగా సుమారు రూ. 1,490 కోట్లను ఆర్జించింది. అనంతరం జూన్ 1న జరిగిన మరో వేలంలో 5.09 ఎకరాల భూమి ఎకరానికి రూ. 204 కోట్ల చొప్పున రూ. 1,038 కోట్లకు విక్రయించబడింది. వివాదంలో ఉన్న 5 ఎకరాల భూమిని 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు కేటాయించిందని, దీని కోసం అప్పట్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్బీహెచ్) రూ. 13.33 కోట్లు చెల్లించిందని ఎస్బీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం కేటాయింపులను రద్దు చేయగా, దానిపై న్యాయపోరాటం కొనసాగుతున్నప్పటికీ టీజీఐఐసీ వేలం నిర్వహించడం సరికాదని వాదించింది. ప్రస్తుతం ఈ కేసులో తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్ తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు. "నేనేం తప్పు చేయలేదు.. ఏదో ఒకరోజు బెయిల్‌పై కచ్చితంగా బయటకు వస్తాను, అంతవరకు పార్టీని వేరే పార్టీకి త్యాగం చేయవద్దని వారితో చెప్పాను. పార్టీ మనుగడ కోసం జైల్లో నా ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాను" అని కవిత వివరించారు. ఇవాళ జైలు నుంచి బయటకు వచ్చాక కొందరు బీఆర్ఎస్ నేతలు టీవీల్లో కూర్చుని ఏది పడితే అది మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి తానే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆమె పూర్తిగా ఖండించారు. ఎన్నికల సమయంలో చర్చ అంతా కేవలం ప్రభుత్వ వైఫల్యాల గురించే జరిగిందని, కానీ ఆ చేదు నిజాన్ని అంగీకరించడానికి బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికీ సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో తాను తీవ్రమైన పక్షపాతాన్ని, అవమానాన్ని చవిచూశానని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# అవినీతిపై సమాధానం చెప్పలేక వ్యక్తిగత దూషణలా?

తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా జగిత్యాల-ధర్మపురి పొలిటికల్ సర్కిల్స్‌లో హీట్ ఒక్కసారిగా పెరిగింది. కాంగ్రెస్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమపై వస్తున్న అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పలేక, లక్ష్మణ్ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారంటూ మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని కొప్పుల ఈశ్వర్ నేరుగా ఆరోపించారు. వీటితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఇసుక రీచ్‌లు మాయమైపోతున్నాయన్నది పచ్చి నిజం కాదా అంటూ ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలను, ఈ అవినీతి లెక్కలను పక్కదారి పట్టించడానికి మంత్రి లక్ష్మణ్ కుల రాజకీయం చేస్తున్నారని కొప్పుల మండిపడ్డారు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావును ఉద్దేశించి 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడటం ఏ రకమైన రాజకీయ సంస్కృతి? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగానే అవినీతిపై మాట్లాడే ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని కొప్పుల ఈశ్వర్ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. అయితే మంత్రి పదవిని వదులుకోవడం అంత సులభం కాదని.. ఎన్నో కష్టాలు పడి, ఎన్నో ప్రయత్నాల తర్వాత ఈసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసేంత ధైర్యం అస్సలు లేదంటూ ఎద్దేవా చేశారు.

# నీట్ రీ-ఎగ్జామ్ విద్యార్థులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

వార్త సాక్ష్యం

నీట్ (యూజీ) రీ-ఎగ్జామినేషన్‌కు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. పరీక్ష రోజైన జూన్ 21న టీజీఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. పరీక్షకు వెళ్లే అభ్యర్థులు తమ హాల్ టికెట్ చూపించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వంటి నగరాల్లోని పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ఉచిత ప్రయాణానికి ఆదేశాలు జారీ చేశారని మంత్రి వివరించారు. ఇటీవల నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) రీ-ఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. ఈ తరుణంలో విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో నీట్ అభ్యర్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. పంజాబ్, ఢిల్లీ, హర్యానా, ఒడిశా వంటి ఇతర రాష్ట్రాలు కూడా విద్యార్థుల కోసం ఇలాంటి ఏర్పాట్లు చేశాయి. ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులకు ప్రయాణ ఖర్చులు తగ్గడమే కాకుండా, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునే వీలు కలుగుతుంది.

వార్త సాక్ష్యం
శుక్రవారం 19 జూన్, 2026

# నంద్యాల మార్క్‌ఫెడ్ గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు

- రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్




నంద్యాల, జూన్ 18 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నేడు నంద్యాలలోని బొమ్మలసత్రం లో ఉన్న మార్క్‌ఫెడ్ కార్యాలయం మరియు గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి ఫరూక్ గోదాముల్లో నిల్వ ఉన్న సరుకు నిల్వలను (స్టాక్) క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడున్న రికార్డులను తనిఖీ చేసి, నిల్వల వివరాలు, పంపిణీ తీరును గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిల్వల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను మంత్రి ఫరూక్ ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని, గోదాములలో ఉన్న సరుకుల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, ఉడుములాపురం కళ్యాణ్, రాయమాల్పురం చంద్రారెడ్డి, పబ్బతి వేణు , మున్నా, నాగేశ్వరరావు, బుగ్గ రాముడు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెనాలిలో వైఎస్సార్ విగ్రహ తయారీ పరిశీలన

-నంద్యాలమాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి




నంద్యాల జూన్ 18 వార్త సాక్ష్యం



గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గురువారం పర్యటించారు. తెనాలిలోని ప్రముఖ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, వారి తనయుడు కాటూరి రవిచంద్ర ల ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ తయారీని స్వయంగా పరిశీలించారు. విగ్రహ శిల్పకళా నైపుణ్యాన్ని చూసి ఆయన శిల్పులను అభినందించారు. నంద్యాల పట్టణం శ్రీనివాస సెంటర్ నందు ఇటీవల మహానేత దివంగత డా.వైఎస్సార్ విగ్రహం ధ్వసం జరిగిన ఘటన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తన సొంత నిధులతో డా.వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రజల సాక్షిగా ప్రకటించడం జరిగింది. ఈ మేరకు ఆయన తెనాలీలో డా.వైఎస్సార్ విగ్రహ తయారీని పరిశీలించారు. శిల్పకళకు పుట్టినిల్లుగా పేరుగాంచిన తెనాలి పట్టణంలో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నంద్యాల నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న అత్యంత భారీ, ప్రతిష్టాత్మక వైఎస్సార్ విగ్రహాన్ని తెనాలికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, వారి కుమారుడు కాటూరి రవిచంద్ర తయారు చేస్తున్నారు. ఈ విగ్రహ తయారీ పనులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారు శిల్పశాలను సందర్శించి స్వయంగా పరీక్షించారు. విగ్రహం యొక్క రూపకల్పన, వైఎస్సార్ గారి ముఖంలో ఉండే ఆ చిరునవ్వు, ఆయన రాజసం ఉట్టిపడేలా శిల్పాన్ని మలుస్తున్న తీరును చూసి రవిచంద్ర కిషోర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ రూపానికి నిలువెత్తు రూపంగా ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు.

# ఎమ్మిగనూరులో కూటమి రెండేళ్ల విజయోత్సవ సభ విజయవంతం





-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎమ్మిగనూరు పట్టణంలో నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సభ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున కూటమి నేతల మధ్యలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య సర్కిల్, శివ సర్కిల్, సోమప్ప సర్కిల్, శ్రీనివాస టాకీస్ సర్కిల్, మార్కెట్ యార్డ్ సర్కిల్, ఓం శాంతి సర్కిల్, స్టేట్ బ్యాంక్ సర్కిల్ మీదుగా కుర్నీ కళ్యాణ మండపం వరకు భారీ ఎత్తున ర్యాలీ సాగింది. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ , ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి , పట్టణ బూత్ పరిశీలకులు పోతురాజు రవికుమార్ , బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రేఖా గౌడ్ గార్లతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మూడు పార్టీల జెండాలను ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి "మా తెలుగు తల్లి" ప్రార్థనా గీతంతో సభను ప్రారంభించారు, గురజాలకు చెందిన ఎస్సీ నాయకులు పెద్ద కిషన్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు అనంతరం ఏర్పాటు చేసిన సభలో జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందని పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వర్గీయ బి.వి. మోహన్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని కొనియాడారు

బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేయబడిందని, జన్ ధన్ పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారని తెలిపారు .

-జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రేఖా గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ ప్రగతిలో కూటమి ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని తెలియజేశారు

విజయోత్సవ సభను ఉద్దేశించి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.అగైన్... అగైన్... ఎన్డీఏ, నో అగైన్... వైసీపీ" అంటూ ప్రజల తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో కొత్త చరిత్ర సృష్టించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు తల్లికి వందనం, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి, దీపం-2, అన్నా క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, ఆటో డ్రైవర్ల సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, డీఎస్సీ ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా తాగునీరు, సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బీఎల్ఎలు, బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ మై టిడిపి యాప్ ద్వారా ప్రతి ఓటరును ధృవీకరించి ఎన్యూమరేషన్ ఫారాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

అనంతరం కార్యకర్తలతో భోజన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ , జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ , జిల్లా కమిటీ సభ్యులు, బీజేపీ కో-కన్వీనర్ తొగట నరసింహులు, నియోజకవర్గ పరిశీలకులు మునిశేఖర్ రెడ్డి , ఎమ్మిగనూరు పట్టణ బూత్ పరిశీలకులు పోతురాజు రవికుమార్, రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి మిన్నప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, మండల, పట్టణ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మకూరు ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం ఆంధ్ర హాస్పిటల్ ప్రారంభం



-ఆధునిక టెక్నాలజీ పరికరాలతో ఆంధ్ర హాస్పిటల్ వైద్య సేవలు
-అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించే విధంగా వైద్యులు ముందు ఉండాలి
-29 రకాల వైద్య సేవలు అందించేందుకు ప్రజల ముంగిట
-వైద్యశాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం
-ఎస్. ఎం. ఆంధ్ర హాస్పిటల్ యాజమాన్యం
-డాక్టర్ ఎస్.కె మహబూబ్ బాషా, ఎస్.కె జిలానీ ఆధ్వర్యంలో హాస్పిటల్ ప్రారంభోత్సవ వేడుక
-ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, బీజేపీ మోమిన్ షబానా





ఆత్మకూరు జూన్ 18 వార్త సాక్ష్యం

ఆత్మకూరు ప్రాంత ప్రజల కోసం నూతన ఆధునిక టెక్నాలజీతో వైద్య రంగంలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించి అత్యవసర పరిస్థితులలో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఆంధ్ర హాస్పిటల్ వైద్యులు ముందుండాలని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, బిజెపి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా పేర్కొన్నారు గురువారం పట్టణంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్ ఎం ఆంధ్ర హాస్పిటల్ ను ఎమ్మెల్యే ముఖ్యఅతిథులు గా హాజరై ప్రారంభించారు ముందుగా ఎమ్మెల్యేను హాస్పిటల్ యాజమాన్యం గౌరవంగా ఆహ్వానం పలికి పూల పుష్పాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు అనంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రూబెన్ కట్ చేసి హాస్పిటల్ ను ప్రారంభించి ఆధునిక టెక్నాలజీతో ఏర్పాటుచేసిన హాస్పిటల్ ను పరిశీలన చేశారు అనంతరం డాక్టర్ ఎస్.కె. మహబూబ్ బాషా, ఎస్.కె. జిల్లాని ల తో కలిసి వైద్య సేవల గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు ఆత్మకూరు ప్రాంత ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో 29 వైద్య సేవలు అందించే విధంగా నూతన ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు ప్రజలకు కావాల్సిన వైద్య సేవలు అందించడమే ఆంధ్ర హాస్పిటల్ యాజమాన్యం లక్ష్యమని తెలిపారు హాస్పటల్ కు వచ్చే ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలియజేశారు సరైన వైద్యం అందక నంద్యాల- కర్నూలు జిల్లాలకు వెళుతున్న ఆత్మకూరు ప్రాంత ప్రజలకు అన్ని విధాలుగా వైద్య సేవలు అందించే విధంగా ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని ఆంధ్ర హాస్పిటల్ యాజమాన్యం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ వంగాల శివరాంరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్, మండల టిడిపి పార్టీ సీనియర్ నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి పటాన్ నాగూర్ ఖాన్. వి ఆర్ ఎస్ వి ప్రాజెక్టు చైర్మన్, పోచ మల్లికార్జున్ రెడ్డి, జనసేన పార్టీ శ్రీరాములు, టిడిపి పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ మహానంది రాజేంద్రారెడ్డి, టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు పలువురు ప్రముఖ వైద్యులు ఆంధ్ర హాస్పిటల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు

# గుడిసెలు లేని గ్రామాలే సర్కారు లక్ష్యం

-ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

వార్త సాక్ష్యం జూన్ 18 మానకొండూర్ :

పూరి గుడిసెలు లేని గ్రామాలుగా పంచాయతీలను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎల్ఎండీ కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్ లో తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధాదారులకు మంజూరు పత్రాలను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న నివాసాలు లేకుండా పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా ఇళ్ల మంజూరు జరుగుతోందని, లబ్ధిదారులు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావు లేదని, అందరినీ అక్కున చేర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం లేదని, ఇళ్ల నిర్మాణాలు



చేపట్టలేమని తప్పుకుంటే వాటిని అర్హులైన మిగితా వారికి మంజూరు చేస్తామన్నారు. ఈ మూడు మండలాల్లో మొదటి విడుతలో మంజూరై ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులను తొలగిస్తూ మిగితా అర్హులకుఇప్పుడు ఇస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే రెండో విడుత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా వెల్లడవుతుందని ఆయన చెప్పారు. ఇళ్లు రాలేదని ఎవరూ చింతించవద్దని, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్, గన్నేరువరం, మానకొండూర్ ఎంపీడీవోలు మల్హోత్రా, శ్రీనివాస్ రెడ్డి, వీవీ వరలక్ష్మి, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి రమేశ్, బొద్దు సునిల్,మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి,మాతంగి అనిల్, బుర్ర తిరుపతి గౌడ్, పొన్నాల సంపత్, కె.ఎల్లారెడ్డితోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# వలస ఆదివాసీ ప్రజల సంక్షేమం,అభివృద్ధి కొరకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది





-దుమ్ముగూడెం మండలం గద్దమడుగు గొత్తికోయ గుంపు, కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న డిఎస్పి అరుణ్ కుమార్

వార్త సాక్ష్యం జూన్ 18 ఖమ్మం

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు ఈ రోజు దుమ్ముగూడెం మండలం గద్దమడుగు గొత్తికోయ గుంపు, కొత్తపల్లి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలోడీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని వలస ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం పోలీస్ శాఖ తరఫున ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. ఆదివాసీ ప్రజలకు కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత,పిల్లలు విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. వర్షాకాలంలో తమ ఇండ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అధికంగా మురుగు నీరు చేరడం వలన దోమలు అధికమై డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాల బారిన పడే అవకాశం ఉందని తెలియజేశారు. గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలను గ్రామస్తులకు వివరించి ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లుగాని, వినియోగిస్తున్నట్లుగాని తెలిస్తే సమాచారాన్ని పోలీసు వారికి తెలియజేయవలసిందిగా కోరారు. ఓటీపీలు ఎవరికి షేర్ చేయవద్దని, అనవసర లింకులు క్లిక్ చేయవద్దని సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్లు ధరించాలని, రోడ్డు భద్రత పై అవగాహన ఉండాలని సూచనలు చేశారు. అనంతరం గ్రామ ప్రజలకు గృహ అవసర వస్తువులను, పిల్లలకు పలకలు, పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్ర మంలో ఇన్స్పెక్టర్ వెంకటప్పయ్య, ఎస్సై జగన్మోహన్ చారి, మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాల దుకాణాలపై పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు



-నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు- అధికారులు

వార్త సాక్ష్యం జూన్ 18 ఖమ్మం

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడడంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టేందుకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో సత్తుపల్లి పట్టణంలో గురువారం విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి, వ్యవసాయ శాఖ ఇంచార్జి ఏవో సుజాత ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను, నవతా ట్రాన్స్పోర్ట్ ను సందర్శించి, విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. అలాగే ప్యాకెట్లపై ఉన్న వివరాలు, తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులను మోసం చేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు లేదా నాసిరకం పురుగుమందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని




హెచ్చరించారు. అవసరమైతే కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపట్టేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.రైతులు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. బిల్లు లేకుండా కొనుగోలు చేసిన వస్తువుల విషయంలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తితే చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని తెలిపారు. అలాగే అనుమానా స్పదంగా కనిపించే విత్తనాలు లేదా ఎరువుల గురించి వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## నంద్యాల జిల్లాలో బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు

-నంద్యాల పట్టణంలో డాక్టర్ బండారు నాగేశ్వరావు యాదవ్ ఆధ్వర్యంలో సంబరాలు



నంద్యాల జూన్ 18 వార్త సాక్ష్యం

బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం నంద్యాల పట్టణంలోని డాక్టర్ బండారు నాగేశ్వరావు యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించుకున్నారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రముఖ వైద్యులు నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి పేద వర్గాలకు తమను తాము పరిపాలించుకునే అవకాశాలను కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ బోడె రామచంద్ర యాదవ్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లుజీవించాలని భగవంతుని ఆశిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ ఆత్మకూరు నియోజకవర్గం ఇతీన్చార్జి ఎస్. రఘు రాముడు యాదవ్ బీసీవై పార్టీ మద్దతుదారులు రామయ్య, శివ, సురేష్, ఉత్తం, చిన్నారి అభిరామ్, పార్టీ అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## తోటమాలి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా హామీ -శ్రీశైల దేవస్థానంఈవో



శ్రీశైలం జూన్ 18 వార్త సాక్ష్యం

శ్రీశైల దేవస్థానం ఆఫీస్ నందు ఈవో, ఎం. శ్రీనివాసులు తో, స్టేట్ యూనియన్, సెంట్రల్ ఆఫ్, ఇండియా. (టి యు సి ఐ) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, వై. ఆశీర్వాదం. ఆయనను కలసి వినతి పత్రం సమర్పించి, ఆయనతో మాట్లాడుతూ, తమ పరిధిలో ఉన్న తోటమాలి, కాంట్రాక్ట్ కార్మికులు గత 30 ఏళ్లుగా తోట అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని, అయితే వారికి కేవలం 9,200 మాత్రమే జీతాలు ఇస్తున్నారని. వారికి పని భద్రత గాని ఆరోగ్య భద్రత గాని లేదని, ప్రమాదవశాత్తు చనిపోతే ఎటువంటి ఆర్థిక సాయం చేయట్లేదని. తోటమాలిలలో పనిచేసిన ఇద్దరు కార్మికులు మృతి చెందారు. వారి కుటుంబాలకి ఎటువంటి ఆర్థిక సాయం అందించలేదని. తోటలో పనిచేస్తున్న కార్మికులు తేలు, పాముల, కాటులకు గురవుతున్నారని, వారికి ఏ మాత్రం ప్రమాదం జరిగిన, కనీసం మెడికల్ ఆరోగ్య భద్రత లేదని. కార్మికులకు పని భద్రత, ఆరోగ్య భద్రత కల్పిస్తూ, పెరిగిన నిత్యవసర ధరల నేపథ్యంలో కనీస వేతన చట్టాన్ని అమలు చేసి జీతాలు పెంచాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన గైడెన్స్ ప్రకారం శ్రమకు తగ్గ వేతనాలు చెల్లించాలని, గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరగా, స్పందించిన ఈవో, ఈ సమస్యలను పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, సమస్యలు పరిష్కరించేలా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో, శ్రీ భ్రమరాంబ. మల్లికార్జున స్వామి. తోటమాలి కాంట్రాక్ట్ లేబర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, గోపాల్ నాయక్. దామోదర్ రెడ్డి. శివలింగం. రాజు. నాయక్. నాగరాజు. మల్లేష్. తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ స్కూలు బలోపేతం చేయాలి

-శ్రీశైలం నియోజవర్గ ఎమ్మెల్యేకు సమస్యల విన్నపించిన అంగన్వాడి కార్యకర్తలు

ఆత్మకూరు జూన్ 18 వార్త సాక్ష్యం

పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసి, ప్రీ స్కూలు బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవిలు



డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ నందు శ్రీశైల నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కి ప్రీ స్కూలు బలోపేతం చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు చిన్నపిల్లలకు గర్భవతులకు అనేక సేవలు అందిస్తున్నారని, యాప్ ల పని ఒత్తిడి విపరీతంగా పెరిగిందని, పనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సామాజిక భద్రత సౌకర్యాలు అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటరులు గా అప్ గ్రేడ్ చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పని భారం పెంచే నవచేతన యాప్ ను రద్దు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న టిఏ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు ప్రమీలమ్మ, విజయలక్ష్మి, రమణమ్మ, స్వప్న, లక్ష్మీదేవి, అరుణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# తెలంగాణలో విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణం

-జిల్లాలోని ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపు పై దృష్టి సారించాలి
-పసుపు బోర్డ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్
-మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

వార్త సాక్ష్యం నిజామాబాద్ జూన్ 18

తెలంగాణలో విశ్వవిద్యాలయాల పరిస్థితి దారుణంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ గవర్నర్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. గురువారం ఆయన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న 19 విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే విశ్వవిద్యాలయాలకు తగిన నిధులు అందకపోవడం వల్ల పరిశోధన ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఘోరంగా ఉన్నాయన్నారు. బడ్జెట్లో విద్యకు నిధులు కూడా అంతంత మాత్రమే కేటాయించడం దారుణం అన్నారు. 2026-27 బడ్జెట్లో విద్య రంగానికి కేవలం 8.2 శాతం మాత్రమే కేటాయించడం తగదన్నారు. తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సిఫారసు ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో కనీసం 18 శాతం విద్యకు కేటాయించాలని సూచించిందని గుర్తు చేశారు. జిల్లాలో నిజాంసాగర్ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు జీవనాడి అని మాజీ గవర్నర్ దత్తాత్రేయ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా గతంలో 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడిందని, ప్రాజెక్టు ప్రభావం ఆయకట్టు మార్పులు ఇతర కారణాలవల్ల ప్రస్తుతం ఆయకట్టు 2.35 లక్షల ఎకరాలకు తగ్గిందన్నారు. ప్రధానంగా పూడిక తొలగింపు, కాలువలు, ఆధునీకరణ నీటి నిల్వ సామర్థ్యం పెంపు వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే మోర్తాడ్ బాల్కొండ ఆర్మూర్ ప్రాంతాల రైతులు ఇప్పటికీ సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పెద్ద వాగు వంటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మించి ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ పై అనేక హామీలు ఇచ్చిందన్నారు. కానీ రెండున్నరలు గడిచిన దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. జిల్లా పసుపు రైతులతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో జిల్లాలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. బోర్డు ద్వారా పసుపు ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పెరిగిందన్నారు. ప్రధానంగా ఎగుమతులు పెరగడం, విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం లభించడం, రైతులకు మెరుగైన ఆదాయం అందడం వంటి ప్రయోజనాలు కలుగుతున్నాయన్నారు. పార్టీ కోసం బూతు స్థాయి కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరూ కష్టపడాలని బిజెపి నాయకులకు కార్యకర్తలకు ఆయన సూచించారు. పదవులు ఉన్నా లేకున్నా పార్టీ కోసం పని చేయాలన్నారు. భవిష్యత్తులో మహిళా బిల్లు, డిలిమిటేషన్ కచ్చితంగా అమలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, టక్కర్ హనుమంత్ రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, ముక్కా దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై బీ.ఎల్.ఓలు, సూపర్వైజర్లకు శిక్షణ తరగతులు

వార్త సాక్ష్యం నిజామాబాద్, జూన్ 18

పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ సర్వేను పురస్కరించుకుని నిజామాబాద్ నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో గురువారం నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎస్.ఐ.ఆర్ సర్వే నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే ఎలా చేయాలి, ఏయే అంశాలను పరిశీలించాలి, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి కీలక అంశాలను వివరిస్తూ బీ.ఎల్.ఓలకు దిశానిర్దేశం చేశారు.ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఓ లు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్ ను పూర్తి చేయాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బీ.ఎల్.ఓలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారివారి శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుండి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్.ఐ.ఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్ళారా, మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఏమాత్రం సంకోచించకుండా శిక్షణ తరగతులలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క ఓటరు కూడా తప్పిపోకుండా చూడాలని, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇతర వి.ఐ.పీల మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ.టీ.పీని ఇతరులకు తెలుపకుడదని, ఇలా చేయడం నేరంగా పరిగణించబడుతుందని జాగ్రత్తలు సూచించారు. ప్రతి ఓటరుకు రెండు చొప్పున ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, వాటిని ఓటరు సరైన విధంగా పూరించారా అన్నది పరిశీలించాలని అన్నారు. పూరించిన ఒక ఫారంను తీసుకుని, మరో ఫారంను ఓటరుకు ఎక్ నాలెడ్జ్ రూపంలో అందించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రీ-మ్యాపింగ్ చేసుకున్న ఓటర్లకు సంబంధించి కూడా ఏవైనా మార్పులు చేయాల్సి ఉంటే, వాటిని సరి చేయవచ్చని తెలిపారు. ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాలన్నారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తవుతున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించబడుతుందని, ఈ మేరకు కొత్త ఓటర్లు ఉంటే ఫారం-6 తో పాటు ధృవీకరణ పత్రం తీసుకోవాలని తెలిపారు. ఉపాధి నిమిత్తం విదేశాలలో ఉంటున్న వారి ఎన్యుమరేషన్ ఫారంపై వారి కుటుంబ పెద్ద సంతకం తీసుకోవచ్చని సూచించారు. 01 జూలై 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. 01 జూలై 1987 నుంచి 02 డిసెంబర్ 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి, తాతయ్య లేదా నానమ్మ ఎవరిదైనా ఒకరి ధ్రువపత్రం సమర్పించాలని, 02 డిసెంబర్ 2004 తర్వాత జన్మించిన వారు స్వీయ ధృవీకరణతో పాటు తల్లిదండ్రులు ఇద్దరి ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, ముసాయిదా జాబితా అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, దరఖాస్తులను పరిష్కరించి, అక్టోబర్ 01న తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో బీ.ఎల్.ఓల కృషితో జిల్లాలోనే అత్యధికంగా ప్రీ-మ్యాపింగ్ 93.5 శాతం జరిగిందని, ప్రస్తుత చివరి దశలో ఇదేవిధమైన కృషిని కొనసాగిస్తూ వంద శాతం మ్యాపింగ్ జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. షెడ్యూల్ మేరకు నిర్ణీత గడువు లోపు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పక్కాగా పూర్తయ్యేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలకు సూచించారు. శిక్షణా తరగతులలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్ఓలు, బీ.ఎల్.ఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



# వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

వార్త సాక్ష్యం జూన్ 18 మంచిర్యాల జిల్లా ప్రతినిధి :

మంచిర్యాల జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలంలోని అటవీ ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్,డి.సి.పి.ఎ. భాస్కర్,జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ,తహసిల్దార్ సదానందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్, సర్పంచ్ విజయలక్ష్మి లతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. 2026 వనమహోత్సవంలో జిల్లాకు కేటాయించిన 41 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి,రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు.రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని,నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు,పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని,ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



వార్త సాక్ష్యం జూన్ 18 ఖమ్మం

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్ లతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాలుపంచుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా గుర్రంగుడ నుండి వర్చువల్ గా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన అరణ్య పార్క్ ల ప్రారంభోత్సవ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి తిలకించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో కె. శ్రీరామ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, ఆర్టీవో సభ్యులు జి. వెంకన్న, అటవీ, వివిధ శాఖల అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి

-పెండింగ్ బిల్లులపై సమగ్ర నివేదిక సమర్పించాలి
-అవసరమైన కొత్త అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించి అందించాలి
-అభివృద్ధి పనుల్లో ఉన్న క్రిటికల్ గ్యాప్స్‌ను గుర్తించి వెంటనే పూర్తి చేయాలి
-వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



వార్త సాక్ష్యం ప్రతినిధి జూన్18

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షఅధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఎంఐడీసీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులపై శాఖల వారీగా సమగ్ర నివేదిక సిద్ధం చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావడంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో అవసరమైన కొత్త ప్రతిపాదనలు ఏమైనా ఉంటే రూపొందించి సమర్పించాలని సూచించారు. ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పనుల అమలులో ఎక్కడైనా క్రిటికల్ గ్యాప్స్ ఉన్నట్లయితే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలో జిల్లాలో ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఏమైనా ఉంటే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో, ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, ఆర్ అండ్ బి ఈఈ భావ్‌సింగ్,కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 19 జూన్, 2026

# వన మహోత్సవానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

-ప్రజల్లో మొక్కల సంరక్షణపై అవగాహన పెంచాలి
-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

వార్త సాక్ష్యం జూన్ 18 నాగర్ కర్నూల్



గురువారం జిల్లా పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్, వెల్దండ గ్రామాలలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమీక్షించి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో చర్చించారు. కల్వకుర్తి నియోజక వర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించిన కలెక్టర్ అక్కడ మొక్కల పెంపకం, సంరక్షణ, నిర్వహణ విధానాలను పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కల నాణ్యత, నీటి వసతి, సంరక్షణ చర్యలు, వాటి పంపిణీ విధానాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పచ్చదనం పెంపొంది ంచడంలో నర్సరీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల అందాన్ని పెంచడంలో మొక్కల పెంపకం ముఖ్యమని చెప్పారు. అందువల్ల నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, వాటి సంరక్షణ, సరైన సమయంలో పంపిణీ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.నర్సరీలో ప్రస్తుతం సుమారు 3,500 మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, త్వరలో నిర్వహించనున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టి, ప్రతి గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలు నాటిన మొక్కలు జీవించేలా వాటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ సూచనల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు, పచ్చదనం కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ,వెల్దండ తహసీల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో చంద్రుడు నాయక్, వెల్దండ సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్, పెద్దాపూర్ సర్పంచ్ కేశమల్ల అనూష, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల గ్రామపంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రయితులకు ఆధార్ నమోదు

-గుర్తింపు, గౌరవప్రద జీవనానికి కొత్త ఆశలు

వార్త సాక్ష్యం జూన్ 18 ఖమ్మం




నిరాశ్రయులు, అనాథలు మరియు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తున్న అన్నం సేవా ఫౌండేషన్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం ఆశ్రయితుల జీవితాల్లో కొత్త ఆశలను నింపింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, అలాగే కొందరికి కుటుంబాలతో పునరేకీకరణకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ (TSLSA) సభ్య కార్యదర్శి పంచాక్షరి ఆదేశాలు, జిల్లా న్యాయ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు (ఇన్‌చార్జ్), జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జి.వి. మహేష్ నాథ్ మార్గదర్శకత్వంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస అన్నం సేవా ఫౌండేషన్‌ను సందర్శించి ఆశ్రయితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలి ంచారు. ఆశ్రయితులలో చాలామందికి గుర్తింపు పత్రాలు లేకపోవడం వల్ల సంక్షేమ సేవలు, ఇతర ప్రయోజనాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా యంత్రాంగం మరియు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఆశ్రమంలోనే ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది.జిల్లా కలెక్టరేట్ మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక శిబిరం నిర్వహణకు సహకరించారు. శిబిరంలో ఆశ్రయితుల బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు.ఇప్పటికే గతంలో ఆధార్ పొందిన వారి వివరాలు గుర్తించబడితే వాటిని తిరిగి పొందేందుకు చర్యలు తీసుకోనున్నారు. అటువంటి వివరాలు లభించిన పక్షంలో వారి అసలు గుర్తింపును నిర్ధారించి కుటుంబ సభ్యులను గుర్తించే అవకాశం ఉంటుంది. కుటుంబ వివరాలు లభించిన వారికి పునరేకీకరణ దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వివరాలు లభించని వారికి కొత్త ఆధార్ కార్డులు జారీ చేయనున్నారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస మాట్లాడుతూ, “గుర్తింపు పత్రం అనేది కేవలం ఒక కార్డు మాత్రమే కాదు. సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న వ్యక్తులకు అది గౌరవప్రదమైన జీవనం, సంక్షేమ సేవలు మరియు న్యాయ పరిరక్షణకు ద్వారంగా నిలుస్తుంది” అని పేర్కొన్నారు.ఆధార్ నమోదు పూర్తయిన అనంతరం జాతీయ న్యాయ సేవా సంస్థ (NALSA) అమలు చేస్తున్న నిరాశ్రయులు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు, సామాజికంగా విస్మరిం చబడిన వర్గాలు మరియు పేదరికంలో జీవిస్తున్న వారికి సంబంధించిన వివిధ న్యాయ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశ్రయితులకు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులో గౌరవప్రదంగా జీవించే హక్కు కూడా అంతర్భాగ మేనని, సమాజంలోని అత్యంత బలహీన వర్గాలకు గుర్తింపు, న్యాయ సహాయం మరియు సంక్షేమ అవకాశాలు చేరేలా చూడటం న్యాయ సేవా సంస్థల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఏళ్ల తరబడి గుర్తింపు పత్రాలు లేకుండా, కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియని పరిస్థితుల్లో జీవిస్తున్న పలువురు ఆశ్రయితులకు ఈ ఆధార్ నమోదు శిబిరం కొత్త ఆశాకిరణంగా మారింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, కుటుంబాలతో తిరిగి కలిసే అవకాశాలకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేయనుంది.

# నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

-కమీషనర్, ఆర్‌డఆర్, ఇరిగేషన్ భూసేకరణ శివకుమార్..
-జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణపై జిల్లా కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్షించిన కమిషనర్.

వార్త సాక్ష్యం జూన్ 18 ఖమ్మం



జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్‌డఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమీషనర్ కె. శివకుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహిం చారు. జిల్లాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై ప్రాజెక్టుల వారిగా సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమీక్ష సందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మున్నేరు--పాలేరు లింక్ కాలువతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని పరిశీలించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కోర్టు కేసులు మరియు సర్వే పనుల స్థితిగతులపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, అవార్డుల జారీ, చెల్లింపుల ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమీషనర్‌తెలిపారు. పెండింగ్ అంశాల పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్రమం తప్పకుండా పురోగతిని సమీక్షించాలని కమిషనర్ అన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ జిల్లాలో పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు సంబంధించి 11 గ్రామాల్లో 193.15 ఎకరాల భూసేకరణ అవార్డ్ దశలో ఉందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు సంబంధించి 14వ ప్యాకేజి క్రింద 650.22 ఎకరాల భూ సేకరణ లో 623.02 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసినట్లు కలెక్టర్ అన్నారు. 15వ ప్యాకేజీకి సంబంధించి 198.13 ఎకరాల భూసేకరణ కు గాను అవార్డ్ పాస్ చేసి, భూనిర్వాసితులకు పరిహారం చెల్లించామన్నారు. ప్యాకేజి16 కు సంబంధించి 820.12 ఎకరాలకు గాను అవార్డ్ పాస్ చేసినట్లు, 796.13 ఎకరాలకు పరిహారం చెల్లింపులు పూర్తి చేసి స్వాధీనం చేసుకున్నట్లు, మిగతా భూమికి పరిహారం ప్రభుత్వం నుండి రావాల్సి ఉన్నట్లు తెలిపారు. ప్యాకేజి 6, 2, 1 లకు సంబంధించి భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఇరిగేషన్ సిఈ లు ఎం. వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసి సదానందం, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అరణ్య అర్బన్ పార్కును వర్చువల్ గా ప్రారంభోత్సవం చేసిన సీ.ఎం



వార్త సాక్ష్యం నిజామాబాద్ జూన్ 18 :

నిజామాబాద్ నగర శివారులో గల మాక్లూర్ మండలం చిన్నాపూర్ వద్ద ఏర్పాటు చేసిన అరణ్య అర్బన్ పార్క్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వర్చువల్ పద్ధతిలో గురువారం గుర్రంగూడ నుండి లాంఛనంగా ప్రారంభించారు. ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అర్పన, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, వి. భుజంగ రావు, అదనపు డీసీపీ శుభం ప్రకాష్ నగ్రాలే, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ తదితరులు అరణ్య అర్బన్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. సఫారీ వాహనంలో పర్యటించి అర్బన్ పార్క్ లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఓపెన్ జిమ్ లు, వాకింగ్ ట్రాక్, ప్లే జోన్ ఏరియా, కల్వర్టులు, పర్క్యులేషన్ ట్యాంకులు, వాచ్ టవర్, సోలార్ ద్వారా నడిచే బోరుబావులు, రోడ్డు వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, అటవీ ప్రాంతాన్ని కాపాడడానికి ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ అధికారులు, సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ, వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు, ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అటవీ ప్రాంత అభివృద్ధి కోసం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో అటవీ శాఖ కార్యక్రమాలను సైతం ప్రభుత్వం కొనసాగించిందని గుర్తు చేశారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తెరిగి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చెట్లు నరకడం ఎంతో సులభం అని, కానీ పర్యావరణానికి, ప్రాణికోటికి ఎంతో మేలు చేకూర్చే మొక్కలు నాటి, వాటిని కాపాడడం గురించి ఎంతో మంది తమకు ఎందుకులే అని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి భాగస్వామ్యం ఉన్నప్పుడే, పచ్చదనం పెంపొందించబడుతుందని అన్నారు. జిల్లాలో అటవీ శాఖ పరంగా చేపట్టే కార్యక్రమాలకు. జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, 63వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని, నిజామాబాద్ నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే 476 ఎకరాల విస్తీర్ణంలో అరణ్య అర్బన్ పార్క్ ప్రజలకు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. దైనందిన కార్యకలాపాలతో అలసిన వారికి అర్బన్ పార్క్ ఆహ్లాదం పంచుతుందని, వ్యాయామం చేసుకునే వారికి మరింత వెసులుబాటు ఏర్పడిందని అన్నారు. అర్బన్ పార్క్ లో మరిన్ని వసతులు అందుబాటులో తెచ్చేలా జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని అన్నారు. అర్బన్ పార్క్ లో అసాంఘిక శక్తులకు ప్రవేశం లేకుండా గట్టి నిఘా ఉంచాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంత సంరక్షణ, విస్తీర్ణం పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. అడవులకు నష్టం కలిగించే వారి పట్ల అటవీశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయన్న డీఎఫ్ఓ సుధాకర్, సర్పంచ్ లు కే.లత, గంగాధర్, చిన్నా విద్యార్థిని, విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ విద్యార్థులు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్

వార్త సాక్ష్యం జూన్ 18 నిర్మల్ జిల్లా ప్రతినిధి :



బీసీ విద్యార్థులు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాల రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అర్హులైన విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం త్వరలోనే అందించనుందని అన్నారు.అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత,ఆ దరఖాస్తు పత్రాల జిరాక్స్ కాపీలను సంక్షేమ శాఖ కార్యాలయంలో తప్పనిసరిగా అందజేయాలని సూచించారు.దరఖాస్తు ప్రక్రియ కోసం అభ్యర్థులు బీసీ కుల ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డ్, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన బ్యాంక్ ఖాతా వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ వివరాలన్నింటినీ ఆన్ లైన్లో ఖచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఉపకార వేతనాలకు సంబంధించిన ఇతర పూర్తి వివరాల కోసం నేరుగా శాఖ కార్యాలయాన్ని సందర్శించవచ్చున్నారు. మరింత సమాచారం కొరకు, సందేహాల నివృత్తి కొరకు 9849290043 నంబరును సంప్రదించవచ్చునని తెలిపారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## టాటా మోటార్స్ షాక్.. జులై నుంచి పెరగనున్న వాణిజ్య వాహనాల ధరలు!



దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ వాణిజ్య వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ట్రక్కులు, బస్సులు సహా కమర్షియల్ వాహనాల శ్రేణిలో గరిష్ఠంగా 2.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త ధరలు జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ముడి పదార్థాల ధరలు, ఇతర ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ భారాన్ని కొంత మేర భర్తీ చేసేందుకు ధరల సవరణ చేపడుతున్నట్లు కంపెనీ వెల్లడించింది. అయితే ధరల పెంపు అన్ని వాహనాలపై ఒకేలా ఉండదని తెలిపింది. మోడల్, వేరియంట్‌ను బట్టి పెరుగుదల మారుతుందని పేర్కొంది. ఇదే నెల ప్రారంభంలో టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహనాల ధరలను కూడా పెంచుతున్నట్లు ప్రకటించింది. పెట్రోల్, డీజిల్ కార్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలపై 1.5 శాతం వరకు ధరలు పెంచనున్నట్లు తెలిపింది. ఆ పెంపు కూడా వచ్చే నెల నుంచే అమల్లోకి రానుంది. ఇటీవల ముడి పదార్థాల ధరల పెరుగుదల, నిర్వహణ వ్యయాల భారం కారణంగా పలు ఆటో కంపెనీలు ధరలను సవరించాయి. గత నెలలో హ్యుందాయ్ తమ వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచగా, మారుతి సుజుకి కూడా ఈ ఏడాది ప్రారంభంలో పలు మోడళ్ల ధరలను పెంచింది.

## లాభాల్లో ముగిసిన సూచీలు-పీఎస్‌యూ బ్యాంకులు, హెల్త్‌కేర్ షేర్ల జోరు



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో కీలక సూచీలు నష్టాల నుంచి కోలుకున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌యూ), హెల్త్‌కేర్, రియల్టీ షేర్లకు బలమైన కొనుగోళ్ల మద్దతు లభించింది. అయితే, ఐటీ రంగంలో చోటుచేసుకున్న అమ్మకాల ఒత్తిడి మార్కెట్ లాభాలను కొంతమేర పరిమితం చేసింది.ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 254.36 పాయింట్లు (0.33 శాతం) పెరిగి 77,409.98 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 82.30 పాయింట్లు (0.34 శాతం) లాభపడి 24,168.00 వద్ద ముగిసింది.రంగాల వారీగా పరిశీలిస్తే, నిఫ్టీ హెల్త్‌కేర్ ఇండెక్స్ దాదాపు ఒక శాతం మేర పుంజుకోగా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ రియల్టీ సూచీలు కూడా గణనీయమైన లాభాలను నమోదు చేశాయి. దీనికి విరుద్ధంగా, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.19 శాతం నష్టపోయి అత్యంత బలహీనంగా నిలిచింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ వంటి కీలక షేర్లు సూచీల లాభాలకు బాసటగా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ సానుకూల ధోరణి కనిపించగా, నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం లాభాల్లో ముగిశాయి.సాంకేతికంగా నిఫ్టీకి 24,200 స్థాయి వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని అధిగమిస్తే 24,400 వరకు వెళ్లే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దిగువన 24,000 స్థాయి కీలక మద్దతుగా పనిచేస్తుందని, ఒకవేళ ఆ స్థాయిని కోల్పోతే లాభాల స్వీకరణ చోటుచేసు కోవచ్చని భావిస్తున్నారు. మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ వరుసగా ఐదో రోజు బలపడి 94.32 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 16 పైసలు మెరుగుపడింది.

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా: హైకోర్టుకు తెలిపిన కేంద్రం




మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'గా రూపాంతరం చెందిందని, సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదులు, పరీక్షల అక్రమాలకు పాల్పడే ముఠాలకు ఇది అడ్డాగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు విన్నవించింది. నీట్-యూజీ 2026 రీ-టెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై విధించిన తాత్కాలిక నిషేధాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. జూన్ 21న జరగనున్న నీట్ రీ-టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గత మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించడంతో పాటు, పరీక్షను రద్దు చేసి పునర్నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, 'నీట్ మాఫియా' వంటి టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా మళ్లీ అక్రమాలు జరగకుండా నిరోధించేందుకే జూన్ 22 వరకు ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. టెలిగ్రామ్‌లోని ప్రైవసీ ఫీచర్లను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను గోప్యంగా ఉంచుతూ సులభంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఆరోపించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాల సరఫరా, ఉగ్రవాద ప్రచారం, సైబర్ దాడులు, ఆర్థిక మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు టెలిగ్రామ్ వేదికగా మారిందని పేర్కొంది. మరోవైపు, ప్రభుత్వ నిర్ణయం భారతదేశంలోని సుమారు 150 మిలియన్ల వినియోగదారుల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కొందరు నేరగాళ్ల చర్యల వల్ల వినియోగదారులందరినీ శిక్షించడం సరికాదని వాదించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, టెలిగ్రామ్‌కు ఎటువంటి తక్షణ ఊరట కల్పించలేదు. నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకే ఈ తాత్కాలిక చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

# స్పోర్ట్స్

## ఉజ్బెకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన కొలంబియా

స్పోర్ట్స్ డెస్క్:




ఫిఫా ప్రపంచకప్2026లో కొలంబియా శుభారంభం చేసింది. గ్రూప్- 'కె'లో భాగంగా ఉజ్బెకిస్థాన్‌పై ఆద్యంతం ఆధిపత్యం కనబరిచి ఘన విజయం సాధించింది. తొలిసారి ప్రపంచకప్ ఆడుతున్న ఉజ్బెకిస్థాన్ 3-1 తేడాతో కొలంబియా చేతిలో ఓటమి చవిచూసింది.మెక్సికోలోని ఎస్టాడియో అజ్టెకా వేదికగా కొలంబియా, ఉజ్బెకిస్థాన్ జట్లు తలపడ్డాయి. లూయిస్ డియాజ్ ఇచ్చిన పాస్‌ను 40వ నిమిషంలో డానియల్ మునోజ్ గోల్‌గా చేయడంతో కొలంబియా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, ఆ తర్వాత రెండో అర్ధ భాగంలో ఉజ్బెకిస్థాన్ 60వ నిమిషంలో కొట్టి సంచలనం నమోదు చేసింది. అబోస్బెక్ ఫేజులేవ్ ఉజ్బెకిస్థాన్ తరఫున ప్రపంచకప్‌లో తొలి గోల్ చేసిన అరుదైన ఘనత సాధించాడు. గోల్ చేసిన సంతోషం మాత్రం ఉజ్బెకిస్థాన్‌కు ఎంతో సేపు నిలవలేదు. డియాజ్ 65వ నిమిషంలో గోల్ కొట్టి కొలంబియాను 2-1 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. జామిన్‌టన్ క్యాపేజ్ అదనపు సమయంలో మరో గోల్ కొట్టి కొలంబియా విజయాన్ని ఖరారు చేశాడు. మరో మ్యాచ్‌లో పనామాపై ఘనా విజయం సాధించింది. కెనడాలోని టొరంటో వేదికగా గ్రూప్- 'ఎల్'లో భాగంగా పనామాతో జరిగిన మ్యాచ్‌లో1-0 తేడాతో ఘనా గెలుపొందింది. అదనపు సమయంలో కలేబ్ యిరెంకి గోల్ కొట్టి ఘనాను గెలిపించాడు.

## బీసీసీఐ కీలక నిర్ణయం.. ఐపీఎల్ 2027 షెడ్యూల్‌లో మార్పు!




స్పోర్ట్స్ డెస్క్:

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక అప్‌డేట్ అందించింది. 2027లో జరగబోయే 20వ ఐపీఎల్ ఎడిషన్ షెడ్యూల్‌లో బీసీసీఐ భారీ మార్పులు చేయనుంది. సాధారణంగా మార్చి చివరి వారంలో ప్రారంభమై, మే ఆఖరి వరకు సాగే ఈ టోర్నీని వచ్చే ఏడాది రెండు వారాల ముందే ప్రారంభించనున్నారు.ఐపీఎల్ 2027 సీజన్‌ను మార్చి 10 నుంచి మే 15 వరకు నిర్వహించేలా కొత్త విండోను ఖరారు చేసినట్లు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా గురువారం వెల్లడించారు. మే నెల చివరి వారాల్లో దేశంలో నమోదవుతున్న విపరీతమైన ఎండల తీవ్రత, కొన్ని ప్రాంతాల్లో ముందస్తు రుతుపవనాల ప్రభావం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ 2026 సీజన్ మే 31 వరకు కొనసాగడం వల్ల ఆటగాళ్లు, మైదానానికి వచ్చే అభిమానులు తీవ్రమైన ఉక్కపోత, ఎండలతో ఇబ్బంది పడ్డారని వెల్లడించారు.ప్రేక్షకుల సౌకర్యార్థమే టోర్నీని రెండు వారాలు ముందుకు జరుపుతున్నామని తెలిపారు. ఇదే సమయంలో ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్య పెరగవచ్చనే ఊహాగానాలకు సైకియా తెరదించారు. అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్, ఇతర దేశాల ద్వైపాక్షిక సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే ప్రతిపాదనను ప్రస్తుతానికి పక్కనబెట్టామన్నారు. వచ్చే సీజన్‌లో కూడా పాత పద్ధతిలోనే 74 మ్యాచ్‌లు జరుగుతాయని స్పష్టం చేశారు.

## జులన్ గోస్వామి రికార్డును సమం చేసిన దీప్తి శర్మ

స్పోర్ట్స్ డెస్క్:




ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా మహిళల జట్టు దుమ్మురేపుతుంది. పాకిస్థాన్‌పై విజయంతో ఈ టోర్నీలో తమ ప్రయాణాన్ని ప్రారంభించిన 'విమెన్ ఇన్ బ్లూ', ఆ తర్వాత నెదర్లాండ్స్‌పై కూడా గెలిచి తమ విజయ పరంపరను కొనసాగించింది. డచ్ దేశంపై 95 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. జట్టు విజయంలో స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కీలక పాత్ర పోషించింది. ఆమె రెండు బంతుల్లో 10 పరుగులు చేసింది. బౌలింగ్‌లో మూడు ఓవర్లలో 26 పరుగులు ఇచ్చి ఒక వికెట్ కూడా పడగొట్టింది.ఈ మ్యాచ్‌లో ఒక వికెట్ సాధించిన దీప్తి శర్మ... సీనియర్ పేసర్ జులన్ గోస్వామి రికార్డును సమం చేసింది. ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో జులన్ గోస్వామి(355 వికెట్లు) అగ్రస్థానంలో ఉంది. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక వికెట్ సాధించడంతో దీప్తి శర్మ ఖాతాలో కూడా 355 వికెట్లు ఉన్నాయి. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో చెరో 355 వికెట్లతో జులాన్ గోస్వామి, దీప్తి శర్మ సంయుక్తంగా అత్యధిక వికెట్లు తీసిన వారి జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరు చేసింది. మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే భారత్‌కు ఇది అత్యధిక స్కోరు కావడం విశేషం. ఆ తర్వాత 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టు భారత బౌలర్ల దాటికి17.3 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. భారత్ బౌలర్లలో శ్రీ చరణి 4 వికెట్లతో నెదర్లాండ్స్ పతనాన్ని శాసించింది. అలానే షఫాలీ వర్మ 3, నందిని శర్మ 2 , దీప్తి శర్మ 1 వికెట్ సాధించారు.

# ఈ మార్నింగ్ రొటీన్‌తో నెగెటివ్ ఆలోచనలకు చెక్ పెడుతున్న సమంత!



స్టార్ హీరోయిన్ సమంత తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఎన్నో ఒడుదొడుకులను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు. అయితే తనలో కలిగే ఆత్మన్యూనత భావం, నెగెటివ్ ఆలోచనలను ఎలా అధిగమిస్తుందో తాజాగా అభిమానులతో పంచుకున్నారు.గతంలో తన డైలీ మార్నింగ్ రొటీన్‌పై ఓ వీడియోను పంచుకున్నానని గుర్తు చేసిన సమంత.. అది కేవలం వీడియో కోసం చెప్పింది కాదన్నారు. ఉదయం ఎండలో కొంతసేపు గడపడం, కృతజ్ఞతా డైరీ రాయడం, ధ్యానం చేయడం, దేవుడికి కృతజ్ఞతలు చెప్పడం వంటి అలవాట్లు తన మనసులోని గందరగోళాన్ని తగ్గించాయని తెలిపింది. ఇవి నెగెటివ్ ఆలోచనలను దూరం చేయడంలో ఎంతో సాయపడ్డాయని పేర్కొంది."ప్రతి ఒక్కరికీ భయాలు ఉంటాయి. ఆత్మన్యూనత కూడా ఉంటుంది. కానీ ఒక క్రమబద్ధమైన రొటీన్‌ను పాటిస్తే వాటిలో చాలా వరకు సహజంగానే తగ్గిపోతాయి. నేను నా అనుభవంతో చెబుతున్నాను" అని సమంత పేర్కొంది. అంతకుముందు 2024లో షేర్ చేసిన మరో వీడియోలో తన పూర్తి మార్నింగ్ రొటీన్‌ను కూడా వెల్లడించింది. రోజూ ఉదయం 5.30 గంటలకు లేస్తానని, వెంటనే కృతజ్ఞతా డైరీ రాస్తానని తెలిపింది. ఆ తర్వాత ఐదు నిమిషాలు ఎండలో గడపడం, శ్వాస వ్యాయామాలు చేయడం, సుమారు 25 నిమిషాలు ధ్యానం చేయడం తన దినచర్యలో భాగమని చెప్పింది.ఇటీవల 'ట్యాపింగ్' అనే పద్ధతిని కూడా అలవాటు చేసుకున్నానని సమంత వెల్లడించింది. ఇది శరీరంలోని ఎనర్జీ బ్యాలెన్స్‌ను కాపాడటంతో పాటు నొప్పులను తగ్గించడంలో ఉపయోగపడుతుందని తెలిపింది. ఈ అలవాట్లన్నింటినీ ఒకేసారి మొదలు పెట్టాల్సిన అవసరం లేదని, ఒక్కటి లేదా రెండింటితో ప్రారంభించినా మంచి మార్పు కనిపిస్తుందని అభిమానులకు సూచించింది. సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా రేపు (జూన్ 19) ప్రేక్షకుల ముందుకు

## 'దృశ్యం 3' తెలుగు ఓటీటీ రిలీజ్‌కు బ్రేక్.. హైకోర్టు కీలక ఆదేశాలు



మోహన్‌లాల్ నటించిన 'దృశ్యం 3' తెలుగు డబ్బింగ్ వెర్షన్‌కు ఓటీటీలో విడుదలకు అడ్డంకులు ఎదురయ్యాయి. తెలుగు హక్కులపై వివాదం తలెత్తడంతో మద్రాస్ హైకోర్టు తాత్కాలికంగా విడుదలను నిలిపివేసింది. తెలుగులో 'దృశ్యం' తొలి భాగాన్ని తెరకెక్కించిన దర్శకురాలు శ్రీప్రియ, ఆమె సంస్థ రాజ్‌కుమార్ థియేటర్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టును ఆశ్రయించాయి. 'దృశ్యం' ఫ్రాంచైజీ తెలుగు హక్కులు తమ వద్ద ఉన్నాయని, మూడో భాగాన్ని డబ్బింగ్ రూపంలో విడుదల చేయడం సరికాదని పిటిషన్‌లో పేర్కొన్నాయి. ఈ వాదనలను పరిశీలించిన కోర్టు, తదుపరి విచారణ వరకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ఓటీటీలో విడుదల చేయవద్దని ఆదేశించింది. దీంతో జూన్ 18 నుంచి స్ట్రీమ్ రావాల్సిన తెలుగు వెర్షన్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. గతంలో 'దృశ్యం', 'దృశ్యం 2' సినిమాలు వెంకటేశ్ హీరోగా తెలుగులో రీమేక్ అయ్యాయి. అయితే మూడో భాగాన్ని రీమేక్ చేయకుండా నేరుగా డబ్బింగ్ వెర్షన్‌గా తీసుకురావాలని నిర్మాతలు నిర్ణయించారు. ఇదే ఇప్పుడు వివాదానికి కారణమైంది.

## వెంకీ-కల్యాణ్ రామ్ మల్టీస్టారర్.. అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్ గ్రాండ్ లాంచ్



టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తి రేపుతున్న భారీ మల్టీస్టారర్ చిత్రానికి ఈరోజు అధికారికంగా అంకురార్పణ జరిగింది. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు, నిర్మాత అల్లు అరవింద్ వంటి సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు.ఈ సినిమాలో కథానాయికల వివరాలను కూడా చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. వెంకీ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి నటించనుంది. దగ్గుబాటి, నందమూరి హీరోల కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# 'నా పేరు పక్కన కులం పేరు వద్దు' కోలీవుడ్ హీరో సనంత్ సంచలన నిర్ణయం



సినిమా ఇండస్ట్రీలో సెంటిమెంట్లు, పేర్ల మార్పులు చాలా కామన్. కానీ ఒక యంగ్ హీరో మాత్రం తన పేరు చివర ఉన్న కులం పేరును తీసేస్తూ తీసుకున్న బోల్డ్ నిర్ణయం ఇప్పుడు కోలీవుడ్‌తో పాటు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'డిమాంటి కాలనీ', 'పేట', 'మహాన్' వంటి క్రేజీ సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్స్ చేసి గుర్తింపు తెచ్చుకున్న నటుడు సనంత్.. ఇప్పుడు హీరోగా మారారు. ఆయన నటించిన లేటెస్ట్ మూవీ 'హార్టిన్' ప్రమోషన్స్ వేదికగా ఆయన మీడియాకు ఒక వినూత్న విజ్ఞప్తి చేశారు. చెన్నైలో జరిగిన 'హార్టిన్' ఆడియో, ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సనంత్ మాట్లాడుతూ... ఇకపై తనను పూర్తి పేరు 'సనంత్ రెడ్డి' అని పిలవొద్దని, మీడియాలో కూడా ఎక్కడా అలా రాయొద్దని విజ్ఞప్తి చేశారు. కేవలం 'సనంత్' అని పిలిస్తే చాలని స్పష్టం చేశారు. సాధారణంగా ఇతర భాషా చిత్ర పరిశ్రమల్లో నటీనటులు తమ పేర్ల పక్కన కులం పేరు (సర్నేమ్) జోడించడం కామన్. కానీ తమిళ చిత్ర పరిశ్రమలో ఇలా పేరు పక్కన కులం పేరును పెట్టుకునే సంప్రదాయం లేదు. అందుకే తమిళ సంప్రదాయాన్ని గౌరవిస్తూ తన పేరులోని 'రెడ్డి' అనే పదాన్ని తొలగించినట్లు తెలుస్తోంది. ఈ సినిమా విషయానికి వస్తే... ఇదొక ఇంట్రెస్టింగ్ ముక్కోణపు ప్రేమకథా చిత్రం. జైపూర్, చెన్నై, ఊటీ వంటి అందమైన లొకేషన్లలో ఈ సినిమా షూటింగ్ జరుపుకుంది. సనంత్ సరసన మడొన్నా సెబాస్టియన్, ఇమయ హీరోయిన్లుగా నటించగా... వాట్సాప్ మణి, డెబ్ నితకర్ ఇతర కీలక పాత్రలు పోషించారు. కిషోర్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా.. 'ప్రేమమ్', 'నేరమ్' చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చిన రాజేష్ మురుగేశన్ దీనికి సంగీతం సమకూర్చారు. స్టెప్ వన్ స్టూడియోస్‌తో కలిసి ట్రైడెంట్ ఆర్ట్స్ పతాకంపై ఆర్.రవీంద్రన్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలోకి రానుంది.

# ' థాంక్యూ సుబ్బారావు' (ఆహా) మూవీ రిలీజ్!

క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఒక తెలుగు సినిమా నేరుగా ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చింది. ఆ సినిమా పేరే ' థాంక్యూ సుబ్బారావు'. చంద్రహాస్ కోట్ల – లావణ్య సాహుకార జంటగా నటించిన ఈ సినిమాకి చెందు ముద్దు దర్శకత్వం వహించాడు.'ఓ పిట్టకథ' సినిమాతో దర్శకుడిగా తన మార్క్ చూపించిన సంగతి తెలిసిందే. దినేశ్ కుర్ర నిర్మించిన ఈ సినిమా, ఈ రోజు (జూన్ 18వ తేదీ) నుంచి 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. సుబ్బారావు (చంద్రహాస్) తన తండ్రి చేసిన అప్పులు తీర్చడం కోసం, ఏదైనా పని వెతుక్కోవాలని అనుకుంటాడు. కేరళలో ఉన్న స్నేహితుడు 'పండు' రమ్మనడంతో అక్కడికి వెళతాడు. స్నేహితుడితో కలిసి 'బోట్ హౌస్'లో ఉంటూ, టాక్సీ డ్రైవర్ గా పనిచేస్తుంటాడు. అదే సమయంలో ఒక బిజినెస్ డీల్ పై అమెరికా నుంచి 'వైష్ణవి' (లావణ్య) వస్తుంది. నెల రోజుల పాటు తిరగడం కోసం ఆమె సుబ్బారావు టాక్సీని మాట్లాడు కుంటుంది. వైష్ణవితో కలిసి తిరుగుతూ ఉండటంతో సుబ్బారావుకి రోజులు చాలా అందంగా గడిచిపోతున్నట్టుగా అనిపిస్తుంది. ఆమె ఎంతో కలుపుగోలుగా మాట్లాడుతూ ఉండటంతో, తనని ఆమె లవ్ చేస్తుందేమోనని సుబ్బారావు భావిస్తాడు. తానే ప్రపోజ్ చేయడం మంచిదని భావిస్తాడు.అయితే అదే సమయంలో అమెరికా నుంచి 'రోహిత్' దిగిపోతాడు. అతనువైష్ణవి పెళ్లి చేసుకో బోతున్నారనే విషయం తెలిసి, సుబ్బారావు దిగాలు పడిపోతాడు. ఒక రోజున ట్రైన్ రన్నింగ్ లో ఉండగా, ఓ నలుగురు కుర్రాళ్లు ఒక అమ్మాయిని అందులో నుంచి తోసేయడానికి ప్రయత్నించే దృశ్యం వైష్ణవి సెల్ ఫోన్ కి చిక్కుతుంది. దాంతో ఆమె ఆ అమ్మాయి ఎవరు? ఆ కుర్రాళ్లు ఎవరు? ఆ అమ్మాయిని వాళ్లు ఏం చేసి ఉంటారు? అనేది తెలుసుకోవాలని వైష్ణవి నిర్ణయించుకుంటుంది. అందుకోసం ఆమె ఏం చేస్తుంది? పర్యవసానంగా ఎలాంటి పరిణామాలను ఎందుర్కుంటుంది? అనేది మిగతా కథ. అమెరికా నుంచి బిజినెస్ పనిపై వచ్చిన వైష్ణవి, రన్నింగ్ ట్రైన్ లో నలుగురు దుర్మార్గుల కారణంగా ఒక యువతి ప్రమాదంలో ఉండటం గమనిస్తుంది. ఆ యువతి ఆచూకీ తెలుసుకుని ఆమెకి న్యాయం జరిగేలా చేయాలనుకుంటుంది. అందుకోసం తన బిజినెస్ పనులను సైతం పక్కన పెడుతుంది. ఈ విషయంలో ఆమెకి ఒక టాక్సీ డ్రైవర్ ఎలా సహాయం చేస్తాడు? ఆమె ప్రయత్నం ఫలిస్తుందా లేదా? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. ఈ కథ 'కేరళ'లో జరుగుతుంటుంది. ఎంగేజ్ మెంట్ జరుపుకున్న వైష్ణవి – రోహిత్, కేరళలో హోటల్ బిజినెస్ చేయడానికి తగిన అనుమతుల కోసం ట్రై చేస్తుండటం .. వాళ్లకి టాక్సీ డ్రైవర్ గా కుదిరిన సుబ్బారావు, వైష్ణవిని ఆరాధిస్తూ ఉండటం .. ప్రమాదంలో పడిన ఒక యువతిని రక్షించడం రంగంలోకి దిగిన వైష్ణవి, రోహిత్ ను – సుబ్బారావును సాయం కోరడం అనే ఈ మూడు




కోణాలలో ఈ కథ ముందుకు వెళుతుంటుంది. సుబ్బారావు కేరళ చేరుకోవడం .. అమెరికా నుంచి వైష్ణవి రావడం .. ఇద్దరి మధ్య పరిచయం తాలూకు సన్నివేశాలతో ఈ కథ అలరిస్తూ వెళుతుంది. ఎప్పుడైతే వైష్ణవికి కాబోయే భర్తగా రోహిత్ ఎంట్రీ ఇచ్చాడో అప్పటి నుంచి కథ మరింత ఊపందుకుంటుంది. వైష్ణవి ముందు సుబ్బారావును అవమానించడానికి రోహిత్ ట్రై చేయడం, అతణ్ణి ఉడికించడానికి సుబ్బారావు ప్రయత్నించడం వంటి సన్నివేశాలతో లవ్ కి కాస్త కామెడీ కనెక్ట్ అవుతుంది. ఇక ఎప్పుడైతే ట్రైన్ లో ఒక ఆడపిల్లను వేధిస్తున్న రౌడీ గ్యాంగ్ ను వైష్ణవి చూసిందో .. ఆ విషయాన్ని గురించి ఆరాతీయడానికి రంగంలోకి దిగుతుందో అప్పటి నుంచి కథ మరో మలుపు తీసుకుంటుంది. ట్రైన్ లో వేధింపులకు గురైన ఆ యువతి ఎవరు? ఆమెను వేధించిన పోకిరీలు ఎవరు? అనే కోణంలో చకచకా సన్నివేశాలను మార్చుకుంటూ ఈ కథ పరుగులు తీస్తుంది.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.